


నట్టనడి ఎండాకాలం.

పడమటి శాంబరం ఆ చెవిలోంచి ఈ చెవిలోకి దూసుకుపోతోంది. వొళ్ళంతా ఉడికి పోతోంది. నేలంతా ఉడికిపోతోంది. చెట్లమీద పక్షులు నీడ దొరక్క సెగలు పొగలయిపోతున్నాయి.

ఎండ అట్లా మండిపోతుంటే వూరు వూరంతా కొలిమిలా తయారయింది. వూరు రెండు భాగాలుగా చీలిపోయింది. పల్లపీధి తెలగాలు, మిట్టమీది గొల్లలు, సాలెపేట, చాకలిపేట, కోమట్లు, బ్రాహ్మణ్యం అంతా రెండు వర్గాలుగా విడిపోయి పళ్ళు కొరుకుతున్నారు. హుంకరించి పిడికిళ్ళు బిగిస్తున్నారు. మధ్యస్థంగా ఉన్నవాళ్ళు ఎటూ చెప్పలేక నలిగిపోతున్నారు. ఈ రెండు వర్గాలకి ఒకపక్క సూరయ్య నాయకుడైతే మరోపక్క శేషయ్య అధిపతి.

సూరయ్య ఆరడుగుల మనిషి. వందెకరాల పొలం, పదిమంది పాలేళ్ళు, నాలుగు రకాల వ్యవసాయం. దేవిడీ అంత ఇల్లు, మందీ మార్బలమున్నూ. శేషయ్య కూడా అంత ఆస్తిపరుడే. అంత మందీ మార్బలం కలవాడే. కనుకనే రెండు

ఏనుగులు ఢీ కొన్నాయి.

అంకమ్మ జాతర జోరుగా సాగుతోంది. ఆరోజు బోనాలు, వీరణాలు, కొమ్ముబూరాలు, పంబజోళ్ళు, మాతంగి అడుగులకి అనువుగా మోగుతున్నాయి. పెద్దగొల్ల "ఖళేజోగా!" అని అరవగానే డప్పులు దిక్కులు పగిలేట్టు మోగుతున్నాయి.

సూరయ్య తెల్లటి ధోవతి కట్టుకున్నాడు. వలబనీనుపైన గ్లాస్కో లాల్చి వేశాడు. అత్తాకోడలంచు ఉత్తరీయం మెడ కిరుపక్కలా వేలాడదీశాడు. పాలేళ్ళు, స్నేహితులు, బంధువులతో మీసం మెలేస్తూ బలిమేకతో ఠీవిగా పందిళ్ళవైపు నడిచాడు. మొత్తమంతా యాభైమంది పరివారంతో సూరయ్య గుడి దగ్గర కొచ్చాడు. అటు చూస్తే ఆశ్చర్యం వేసింది. అటుపక్క శేషయ్య వందమంది జనంతో సిద్ధంగా ఉన్నాడు. హుందాగా నుంచుని మీసం మెలేస్తున్నాడు శేషయ్య. అతనూ తెల్లటి ధోవతి కట్టి అత్తా కోడలంచు ఉత్తరీయం వేశాడు. సూరయ్య, శేషయ్య ఒకళ్ళ నొకళ్ళు కొర కొర చూసుకున్నారు. పళ్ళు పట పట కొరుక్కున్నారు. జనం ఇద్దరు పెద్దల్ని, వాళ్ళ ముఠాల్ని చూసి ఏం గొడవ జరుగుతుందో అని బిక్కు బిక్కుమంటూ చూస్తున్నారు.

సూరయ్య పంబలవాణ్ని పిలిచి "ఏందిరా అలీసెం. మొదలెట్టండి బోనాలు. మన మేక అదుగో"అన్నాడు. పాలెగాడు బంతిపూల దండ వేసిన మేకను తీసుకొచ్చి పోతురాజు బండ దగ్గర నుంచోపెట్టాడు. పంబలవాడు కొంగాలకత్తి తీసుకుని భయం భయంగా వచ్చి నుంచున్నాడు.

"ఆగు" అని పెద్దగా అరిచాడు శేషయ్య.

అంతా నిశ్శబ్దమై పోయింది.

"ఈ ఏడు జాతరకి డబ్బిచ్చింది నేను. ముందు నా పోతు తెగింతర్వాతే మిగతా బోనాలు. ఏదిరా మనపోతు" అన్నాడు శేషయ్య.

శేషయ్యపోతుని ముందుకు తీసుకొచ్చారు. సూరయ్యకి నెత్తురు ఉడికిపోతోంది. తను వూరికి ఇంతకాలం పెద్ద రైతుగా ఉన్నాడు. తన వేటతెగిం తర్వాతే మిగతా

బోనాలు. ఈనాడు తనకింత తలవంపులా! సూరయ్యకి నెత్తురు కళ్ళలోకి వచ్చింది. "ఒరేయ్ ఇన్నేళ్ళ బట్టి జాతర జరుగుతోంది. ఎన్నడన్నా మా వేట ముందు ఇంకోటి నరికారంట్రా! చూస్తావేరా నాయాల! ముందు మా మేకని నరుకు" అన్నాడు గర్జిస్తూ.

మేకపిల్ల జాలిగా 'మే' అని అరుస్తూ దిక్కులు చూస్తోంది.

శేషయ్య ముందుకొచ్చి "అమ్మోరికి జాతర లేకపోతే యాడకి పోయినార్రా యీ పెద్దలు? నేను డబ్బిచ్చి నడిపిస్తన్నాన్రా యీ జాతర. ఈ జాతర నాది. ముందు నా పోతు తెగాల్సిందే! లేకపోతే నెత్తురు కళ్ళ జూస్తా" నిప్పులు కురిపించాడు శేషయ్య.

పంబలవాడు ఏడుస్తూ "నేనేటి సేతును ...... ఏటి సేతును ...." అంటూ దణ్ణం పెట్టాడు.

"ముందు మాది" జనం కేకలు.

"ముందు మాదే" ఇటునుంచి అరుపులు.

కర్రలు పైకి లేచాయి. జనం విరగదొక్కుకుంటున్నారు. ఇంకోక్షణం ఆగితే తలకాయలు పేలిపోయేవే.

"ఆగండాగం"డంటూ ముసలి పెద్దలు రెండు ముఠాలమధ్యకీ వచ్చారు.

"ఈ జాతర జరగాలంటారా వొద్దా?" అనడిగారు సూరయ్యని.

"జరగాల్సిందే" అన్నాడు సూరయ్య. అదేప్రశ్న శేషయ్యని వేస్తే "నేను డబ్బిచ్చాను గదా" అన్నాడు. ఇద్దరికీ ఓ పద్ధతిని రాజీ ఏర్పాటు చేశారు. ఇంకో పంబలవాణ్ణి పిలిపించారు. మరో కొంగాలకత్తి తెప్పించారు. రెండు పోతుల్ని పోతురాజు బండదగ్గర పక్క పక్కన నుంచోపెట్టారు. 'ఒకటి ..... రెండు ...... మూడు' అనేసరికి రెండు పోతుల్ని ఒకేసారి బలిచ్చారు.

జాతరైతే సాగిపోయిందిగాని సూరయ్యకి శేషయ్యకి ఇద్దరికీ తృప్తి లేదు. 'వాడు నాకు దీటా?' 'ఆ పుండాకోర్‌తో నేను సమమా?' అని కుతకుత ఉడికిపోయారు.

జాతరైన నాల్గో రోజున శేషయ్య పొలంలో కుప్పలు తగలబడ్డాయి. అది జరిగిన వారం రోజుల్లో సూరయ్య అరక, ఎద్దులు మాయమయ్యాయి. అది జరిగిన ఓ నెలరోజులకి సూరయ్య పాలెగాడి ఇల్లు తగల బడింది. ఆ తర్వాత శేషయ్య ముఠావాళ్ళ ఇళ్ళలో దొంగలు పడ్డారు.

నిప్పు రాజుకుంది. బాగా రాజుకుంది.

మంటలు లేచాయి.

సూరయ్య పొలంలో పనిచేసే కూలీలు శేషయ్య పొలంలో పని చేయరు. ఒకర్తో ఒకరు మాట్లాడుకోరు. అలాంటి సమయాన శేషయ్య జనం, డొంకలో సూరయ్య బండిని అడ్డగించి జొన్నల బస్తాలు దింపించారు. నిమిషాల్లో వార్త వూళ్ళోకి పాకింది. సూరయ్య జనం కర్రలూ, బరిసెలూ తీసుకుని డొంకలోకి పరుగు పరుగున వచ్చారు. ఇది తెలిసి శేషయ్య ముఠా కూడా డొంకలోకి పరుగెత్తారు. దొమ్మీ జరిగింది. తలలు పగిలాయి. కాళ్ళు విరిగాయి. నెత్తురు చిందింది. అంతలో రెండు పక్కల్నించీ 'ఆపండి!' అని కేకలు. కొట్లాట ఆగిపోయింది. జరగవలసిన దురంతం జరిగిపోయింది. సూరయ్య అల్లుడి తల పగిలి పోయింది. శేషయ్య కొడుకు మెడ నరికివేయబడింది. శేషయ్య కొడుకు శరీరం మీద పడి భోరున ఏడుస్తున్నాడు. సూరయ్య అల్లుడి శరీరాన్ని కావిలించుకుని కన్న కూతురు దుస్థితిని తలుచుకొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. రెండు శవాలు ఒకేసారి స్మశానానికి ఆ తర్వాత తీసుకొచ్చారు. ఒకేసారి దహనం చేశారు. సూరయ్య, శేషయ్య మల్లయ్య రేవులో స్నానాలు చేసి వొడ్డుకి వచ్చి ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు. ఆ చూపుల్లో కసి లేదు. పగ లేదు పగ పట్టటానికి, సాధించటానికి వాళ్ళకిక శక్తిలేదు. బతుకులో బహు విలువైంది ఇద్దరూ పోగొట్టుకున్నారు. ఇద్దరూ మల్లయ్య గుళ్ళోకి నడిచారు. ఎవరూ గంట కొట్ట లేదు. దేవుడికి దణ్ణం పెట్టుకొని సూరయ్య శేషయ్య వైపు తిరిగి 'ఏరా! అంకమ్మ తల్లికి బలి సరిపోయిందా!' అన్నాడు.

శేషయ్య పొంగి వస్తున్న దుఃఖంతో సమాధానం చెప్పలేక సూరయ్యని కౌగలించుకొని భోరుమన్నాడు.*